# ఎ.ఎక్స్.మణి — ఉద్యోగం

కాలింగ్ బెల్ విని వెళ్ళి తలుపు తీశాను.

దశరథుడు లోపలికి వచ్చాడు.

దశరథుణ్ణి చూస్తుంటే నాకు రాజ్‌కపూర్ గుర్తు వస్తాడు. ముఖ్యంగా జోకర్‌లో రాజ్‌కపూర్. ఆ కళ్ళలో రాజ్‌కపూర్ చూపు, కరుణాత్మకమైన చూపు, ఒలికి పోయిన పాలనిఎత్తుకోటానికి ఎవరైనా ప్రయత్నిస్తుంటే ఎట్లాగ చూస్తాము?-అటువంటి చూపు.

పిల్లవాడు స్కూలుకి వెళ్ళనంటాడు తిట్టినా కొట్టినా లాలించినా మనమాట వినడు. ఇంకో మార్గం కనిపించదు. అప్పుడు మనంచూస్తూనిలబడి పోతాం, అటువంటి చూపు నేను ఈమాట అంటే. ఆయనా పిల్లలూ ఛీ అన్నారు.

"రాజ్‌కపూర్ ఎక్కడా, వీడెక్కడా?" అన్నారు.

ఏమో నాకు మాత్రం అజ్ఞాతమైన పోలిక ఏదోస్ఫురిస్తుంది. కళ్ళలోనే అయ్యుంటుంది. అంతస్తులువేరు కావచ్చు, అంతరాత్మలు ఒకటి కాకూడదనలేముకదా దశరధుడు తలుపు మూల చెప్పులు విప్పాడు. వెళ్ళి తను ఎప్పుడూ కూర్చునే స్థలంలో కూర్చుంటూ

"అమ్మా, బాగున్నారా? అనడిగాడు.

"ఆ." అంటూ చూశాను అప్పుడు.

మనసు కలచినట్లు అయింది. అతడి మొహంలో బాగా మార్పు కనిపిస్తోంది. కళ్ళు లోపలికి పోయి గుంటలు ఏర్పడ్డాయి. లోపలికి పోయిన కళ్ళు చితికి నీరు కారుతున్నట్లున్నాయి. మొహం నిండా ముడతలు, గీతలు.

దళసరి అద్దాలతో ఎగుడు దిగుడుగా ఉన్న కళ్ళజోడు. చేతిలో చింకిగా ఉన్న గొడుగు.

విప్పిన చెప్పులకి లెక్కపెట్టలేనన్ని అతుకులు. మాసిన పంచ. మాసి వదులుగా ఉన్న చొక్కా.

బక్కచిక్కిన శరీరం. ఒకప్పటి అందమైన కట్టడం తాలూకు శిధిలంలాగున్నాడు.

ఇదివరకు బాగానే ఉండేవాడు, నేను ఈ ఊరికి కొత్తగా వచ్చిన రోజుల్లో.

ం ం ం ం

"రా. బాగున్నావా?" అంటూ ఆయన ఎవరినో పలకరిస్తున్నారు

"ఎవరు వచ్చారో!" అనుకుంటున్నాను కర్టెన్ వెనక నిలబడి.

"ఇటురా ప్రభా. దశరథుడు వచ్చాడు." అంటూ నన్ను పిలిచారాయన.

ఎవరొచ్చారో! ఆఫీసువాళ్ళో అయినవాళ్ళో అయిఉంటారనుకుంటూ బిడియ పడుతూ వెళ్ళాను. చూడగానే

"ఇతనా!" అనిపించింది.

నుంచుని ఉన్నాడు. పంచె, షర్టు, చదువూ, ఉద్యోగం లేని క్రిందతరగతి మనిషని చెప్తున్నాయి.

"కూర్చో." అన్నారాయన నన్ను.

చిరాకువేసింది. కూర్చుని ఏంచెయ్యాను!

"నమస్కారమమ్మా. మిమ్మ చూద్దామనే వచ్చాను తల్లీ. ఏం రూపం! చక్కగాఉన్నావు తల్లీ. బాబుకి తగ్గట్టున్నావు. ఈడూజోడూ బాగుంది. ఆ ముఖమే చెప్తోంది సుగుణాలరాశివని!" అన్నాడు, నాకు దగ్గరగావచ్చి పరీక్షగా చూస్తూ.

అప్రయత్నంగా నవ్వు వచ్చింది. ఆయన నావేపు చూసి నవ్వారు.



"కూర్చో అమ్మా. బాబుపక్కన కూర్చో. నాముందర సిగ్గుపడకుతల్లీ" అన్నాడు మళ్ళీ.

సోఫాలో ఆయన పక్కన కూచున్నాను.

"అతడిమాట వింటున్నానేమిటి?" అనిపించింది.

"పనిలోకి వెడుతున్నావా?" అనడిగారాయన దశరథుణ్ణి.

"అదేగదు బాబూ ఇప్పుడొచ్చిన చిక్కు... గొప్పకష్టం వచ్చిపడిపోయింది బాబూ. ఏం చెప్పుకోనూ. ఆ ఫెర్గూసన్ గాడు నా మీద కత్తిగట్టాడు. కోపం పెట్టుకున్నాడు."

"ఎందుకూ ? ఏమైంది ?" ప్రశ్నించారాయన.

"ఎందుకేటి బాబూ! ఆడు లండన్ నించి వొచ్చాడు గాసీ-బురదలో విత్తనాలు గుచ్చేసి పైన మట్టి జల్లించేశాడు. లోని విత్తనాలన్నీ కుళ్ళిపోయినాయి. మొక్క మొలవ లేదు. నేను అప్పుడే అన్నాను. నువ్వు పెద్దోడివే.... ఫెర్గూసన్.... లండన్ నుంచి వొచ్చావే కానీ నీకు, సిల్లీ యు నో నథింగ్ అన్నాను. నెల తిరిగింది. కాగితం చేతికి వచ్చింది. ఉద్యోగం ఊడిపోయింది. నా చేత కాగితం మీద సంతకం పెట్టించినాడు. ప్రమోషన్ యిప్పిస్తున్నానన్నాడు. నాకు తెలీకపోయింది.రిజైన్ లెటర్ రాసి సంతకం పెట్టించాడు. ఇంకేం చేస్తాను బాబూ!" అన్నాడు.

"మరి యిప్పుడేం చేస్తున్నావ్? ఎలా గడుస్తోంది?" ఆదుర్దాగా అడిగారు ఆయన

దశరథుడు చేతులు నలుపుకుంటున్నాడు!

"ఏం చేస్తాను బాబూ. పెద్దోడు సత్యం పనిలో కెడుతున్నాడు. పశువుల్ని మేపటం, కడగడం.... రోజుకి రెండు యిస్తారు బాబూ.



అది భార్య అణ్ణి వొగ్గేసింది. కూచుంటే గడవదు కదా బాబూ. పిల్లలకి ట్యూషన్ చెపుతున్నాను. అక్షరాలు చెబుతాను. అంకెలు చెబుతాను. డాక్టరు గారు వాళ్ళ బాబుని నా దగ్గర కూచోబెట్టి ఈ పంచెల చాపు ఇచ్చారు బాబూ. ఏదో మీ దయ వల్ల...."

"నా దయేమిటి మధ్యలో!" ఆయన సిగ్గుపడుతూ అన్నారు.

"అమ్మమ్మా, ఎంత మాట ! అట్లాగనకండి బాబూ. అంతా మీదయే. మీ నాన్న గారు మహారాజు. ప్రాణాలు చేతపట్టుకుని రంగం వొదిలి పారిపోయి వస్తే ఆ మహారాజే కదూ మాకు అన్నం పెట్టి మా కుటుంబం నిలబెట్టారు. నాకు ఉద్యోగం వేయించారు దొరతో చెప్పి. నా కూతుర్ని పనితో పెట్టుకున్నారు. దానికి యిచ్చిన అన్నం కూరలూ మా యింటిల్లిపాదిమి తినేవాళ్ళం. మీ ఉప్పు తిని పెరిగిందే బాబూ ఈ శరీరం అన్నాడు వడలిపోయిన "జబ్బల్ని చూసుకుంటూ.

నాకు నవ్వు వచ్చింది. కని పెట్టినట్టున్నాడు అతను కూడా నవ్వుతూ.

"యిప్పుడిట్టాగున్నాను కాని తల్లీ, వయసులో ఉండేప్పుడు బాగుండే వోణ్ణమ్మా. మా వోళ్ళంతా నన్నూ, నా వేషాన్నీ చూసి నువ్వు దొరల యింట్లో పుట్టాల్సినోడివిరా అనే వారు. అంతా దొరల తిండే బ్రెడ్డు, బటరు... చికెన్....

"టీ తాగుతావా ?" అనడిగారు దశరధుడి వాక్ప్రవాహాన్ని ఆపుతూ ఆయన.

"ఏదో మీ దయ. మీరిస్తే తాగనా. రంగంలో వుండగా అలవాటయిందమ్మా చాయ్. అది పడకపోతే ప్రాణం నిలవదు తల్లీ. పూటకి తిండి లేకపోయినా అది పడిపోవాల."

"అక్కడ.... అదే రంగూన్‌లో ఏం చేసేవాడివి?" అనడిగాను.

మనిషి నిటారుగా అయ్యాడు.

"గొప్ప ఉద్యోగం తల్లీ. అప్పుడిట్లా ఉండేవాడినా. బట్టలెప్పుడూ నలగకుండా మల్లెపువ్వుల్లా వుండేవి. వీధిలో నడుస్తుంటే, ఆడోళ్ళంతా నాకేసి చూసేనారు. యింక పనిలో కెడితే ఏ ఓడ అయినా సరే మన దగ్గర ఆగాల్సిందే. యిట్లా దుర్భిణీలో చూసేవాడిని. వాడు కెప్టెనయినాసరే, మరెవడైనా సరే నీ పేరేమిటి ? ఏ సరుకుంది? ఎంత వుంది? పెన్నించటం. రాసెయ్యటం. సరంగు పని చేసేవోణ్ణి. బొంబార్డుమెంటు అయింది, వచ్చేశాను. అప్పటి నుంచి సుకం లేదు తల్లీ. యిక్కడ ఫారంలో పనికి కుదిరాను. ముగ్గురు పిల్లలు. కొడుక్కి పెళ్ళి చేశాను. కోడలొదిలేసింది. కూతురికి పెళ్ళి చేస్తే దాన్ని అల్లుడొదిలేశాడు. అంత బరువూ నా మీదే. కూతురికి రెండువేలు ఖర్చు చేసి పెళ్ళి చేశాను తల్లీ. నాగరం, జడకుప్పెలూ, చేయించాను. వాడిమొహమ్మంత, తాగుతాడు. నాగరం, జడకుప్పెలు అమ్ముకుని తాగేసి పెళ్ళాన్ని పుట్టింటికి తోలేశాడు. ముందరనుంచే ఉంకో గుంటని ఉంచాడు."


"కోడలెందుకు రాదూ ?"

"వీడు దాన్ని సినిమాకి తీసికెళ్ళలేదంట, పూలు కొని పెట్టలేదంట. మరి సత్యాంని మద్దెమద్దెలో కూచో బెట్టేస్తారు? జీతం దొరకదు, తిండి తింటామా, దాని షోకులకే యిస్తామా? వంటచేస్తూనే సగం కూర తినేస్తుందమ్మా. మా అమ్మాయి దెబ్బలాడితే ఏ వేష్మీ అనలేదని సత్యాన్ని నువ్వు మొగాడివికాదు. నీకు పెళ్ళాం అవసరంలేదు అని జగడా చేసి పుట్టింటికెళ్ళిపోయింది. మారుమనువాడుతుందంట. ఈ సంగతులన్నీ ఎవరికి చెప్పుకోనమ్మా. బాబుగారికి మేమంటే గొప్ప అభిమానం తల్లీ. చిన్నప్పుడు ఎత్తుకున్నాను. ఆడించినాను. అమ్మ ఏంచదువుకున్నారు బాబూ!"

"మెట్రిక్ పాసయింది."

బాగుంది. చదువుకున్నతల్లిని." యిల్లు కళకళలాడిపోతూంది. యియ్యాల్రేపు అందరూ చదువుకొని ఉండాలమ్మా. మీకు ప్రెజెంటు






తెద్దామనుకున్నాను, రాధాకృష్ణలపటం. బల్లమీదెట్టి మరిచి పోయాను. జ్ఞాపకశక్తి తగ్గిపోతోందిబాబూ. పెద్దాడినైపోతున్నాను!"

"సరేలే. నువ్వుబహుమతులేమీతీసుకురాకు." అన్నారాయన.

"లచ్చనంగా పెళ్ళి చేసుకున్నారు. పేదోడినైతేమాత్రం, ఉత్తచేతుల్తోవస్తానా బాబూ ! ఈ పారి గుర్తుపెట్టుకొని తెస్తాను. మీరు పుచ్చుకోవాలి." అన్నాడు. టీతో బాటు, కారంపూస, లడ్డు యిచ్చాను. ప్లేటు అందుకొంటూ

"దీర్ఘసుమంగళీభవ!".. అని దీవించాడు.

ఆయన చెప్పారు. దశరధుడు డయిరీ ఫామ్స్‌లోపనిచేసేవాడుట. నెలకి ఐదారు వందల దాకా సంపాదించేవాడుట మేస్త్రీ పని. కొడుకు, కూతురు వీళ్ళింట్లో పనిచేశారుట, చిన్నపుడు పిల్లల్నిఎత్తుకోవటం, ఆడించటం, చెట్లకి నీళ్ల పెట్టడం. ఆఫీసుకి భోజనం క్యారియరు తీసికెళ్లటం మొదలయినపనులు. భార్యని మాత్రం పనికి వెళ్లనిచ్చేవాడు కాదుట.

"పెళ్ళి మిఠాయితిన్నాను. బాగుందమ్మా. బాబూ, మీరు పెళ్ళిచేసుకునివచ్చారు. మరి కొత్త పంచ యిప్పించరా ? నిన్ను ఆశీర్వదిస్తున్నాను. నీకు యివాళ్టినుంచి సరిగా నెలనాడు ప్రమోషన్‌వస్తుంది. అందరూ నీకింద ఉంటారు. ఎవరయినా నీ మాట వినాల్సిందే. నువ్వు మళ్ళీ ఏడాది ఈ రోజుకి కారు కొంటావు. మీరు వైభోగంగా ఉంటారు. నూరేళ్లకి కలకాలం మీరు చిలకాగోరింకల్లాగ ఉంటారు. మళ్ళీ ఈ రోజుకి అమ్మ కొడుకుని ఎత్తుకుంటుంది. మీకేం భయంలేదు. అన్నీ మీ ఆవిడే చూసుకుంటుంది కాలు కింద పెట్టనీదు. " అన్నాడు.

ఊరికి కొత్తగా వచ్చాను, బితుకు బితుకుగా ఉంది, ఎవరెవరోవచ్చి చూసి వెళ్లారు కానీ యింతహామీ ఎవరూ యివ్వలేదు. దశరధుడు ఎప్పటినుంచో తెలిసినమనిషిలా, బంధువులా అనిపించాడు.

ఆయన బీరువాతెరిచి ఒక కొత్తపంచె తీసి యిచ్చారు, పెళ్లిలో చాలా వచ్చాయి, ఆయన పంచకట్టుకోరు. యివ్వనా అనడిగారు, యివ్వమన్నాను, యిచ్చారు,

"నాకు తెలుసు నువ్వు యిస్తావని, యిది నా హక్కు బాబూ. నిన్ను ఆడించాను, నన్ను ఒక్కక్షణం ఒదిలేవాడివికాదు. రోజూ

బెలూన్‌లుకొని పగలగొట్టేవాడివి. మీ నాయన నిన్ను కారులో తిప్పటానికి తీసికెడుతుంటే నన్నుకూడా ఎక్కమనేవాడివి మీనాన్నగారు కూడా "ఎక్కవోయ్ దశరధుడూ, నీకు వాహనయోగ ముంది" అనేవారు ఆ రోజులు మళ్ళీరావు బాబూ, మీ అమ్మగారు నేను రాగానే కూచోమని ప్లేటు నిండా పూరీలు కూర పెట్టి తెచ్చేవోరు, తినేదాకా వదిలే వోరు గాదు బాబూ. గొప్ప మనసున్నతల్లి నీ అత్తగారు వెళ్లొస్తానమ్మా. వస్తుంటాన్లే, బెంగెట్టుకోకు. బాబు! నీ కేంలోటుచెయ్యరు."

ఆ చిన్నకళ్లలో ఒక మెరుపు. అప్పటికి ఆరోగ్యంగానే ఉన్నాడు అరవైఏళ్ళున్నా పొట్టిగా దృఢంగా ఉంటాడు. చిన్నకళ్లు... కొంచెంలోపలికి....నీలిరంగులో! ... చూపుల్లో మాటల్లో చురుకు, కొంటెతనం. ఒకపక్క తను గొప్పవాడినంటూనే ఉంటాడు. ఇంట్లో ఏమీలేవంటాడు. మాటలతోటి బోల్తాకొట్టిస్తాడు. మంచివాడో, భ్రష్టాజో, అవకాశవాదో, ఆత్మీయుడో తేలదు మనకి. ఉన్నంత సేపు వినోదం కలిగిస్తాడు. వెళ్లగానే అనిపిస్తుంది నాలుగు కబుర్లు చెప్పి తనకి కావలిసింది రాబట్టుకుంటాడని. తరచూవస్తూవుండేవాడు. ఈసారివచ్చిచాలారోజులయింది ఇపుడిట్లాగు న్నాడు, జాలివేసింది, కాలంతెచ్చేమార్పు. పాలరాతిభవనాలు వెలిసిపోతాయి. నవనవ లాడే చెట్లు పుష్పించి ఫలించి రాలిపోతాయి.

"ఇంకెన్నాళ్ళో బ్రతకడు పాపం!" అని పించింది, ఈ కాలంలో నెల నెల సంపాదించు కుంటుంటేనే గడవటం కష్టంగాఉంది, ఎట్లా బతుకుతున్నారో పనిపాటా లేకుండా అని పించింది, ఎప్పుడో రెండూ, మూడూ ఇవ్వటం తప్ప మేము చేస్తున్నసాయమేమీ లేదు.

ం ం ం ం

"అంతా బాగున్నారా" అనడిగాను.

"ఆఁ మీదయవల్ల...." అన్నాడు జేబులో కాగితాలమధ్య వెతుకుతూ.

చూస్తూ నుంచున్నాను.


"ఆ మద్దిన మా రెండోవోడు వెంకట్‌కిఉద్యోగం అయిందని చెప్పాను గదూ. వాడికి పెళ్ళి చేస్తున్నాము. ఇదిగో యిన్విటేసన్. మీరు రావాలమ్మా బాబుగార్నికూడా లాక్కురావాల ఆ పిల్ల మాకు కావలసిందాయే. నా బావమరిది కూతురు. ఐదోక్లాసు చదివింది. కట్నం రెండువేలు. ట్రాన్సిస్టర్, వాచీ యిస్తామన్నారు. సూటు పెడతారు పెళ్ళికొడుక్కి. అమ్మాయికి పదితులాల బంగారం ఉంది. జతకుప్పెలు, నాగరం, మెళ్ళో గొలుసు. పిల్ల లచ్మి. గొప్ప సంబంధం తల్లీ. మాబావమరిది కార్ఖానాలో పని చేస్తున్నాడు. మేం బీదోళ్ళ మయిపోయినా మని రాకపోకలు లేవు యిన్నాళ్లూ. యిప్పు డీడు మెట్రిక్ పాసయి పోయాడు. ఉద్యోగస్తు డయ్యాడు. నా బావమరిది పిల్లనిస్తానని కబురెట్టాడు. నేనువొద్దుగాక వొద్దు అన్నాను. నాభార్య కళ్ళనీళ్ళెట్టుకుని ఏడ్చింది అన్న కూతుర్ని చేసుకుంటానని. పిల్ల నల్లగా ఉంటుం దనుకో. కానీ కళైన మొహం తల్లీ. బుద్ధి మంతురాలు, అంతా మా వెంకట్ అదృష్టం. మేం బీదోళ్ళమని రావటం మానకు తల్లి. నీ ఆశీర్వాదం కావాల" అన్నాడు.

కార్డు అందుకుని చూశాను. అట్లాగేలే అన్నాను. లోపలికి వెళ్ళి కార్డు దాచిపెట్టి ఐదు రూపాయలు తెచ్చి యిచ్చాను, పెళ్ళికి వెడతామో లేదోఅని.

"ఒక పాతచీర యిచ్చెయ్ తల్లి.. నువ్వు కట్టి విడిచింది. మా యావిడ మరీమరీ అడి గింది. నీచేత్తో చీరయిచ్చి చాలారోజులైంది. ఏదో నీదయా ధర్మం వల్ల యిలా గడిచి పోతోంది" అన్నాడు.

నవ్వు వచ్చింది. దయాధర్మం వల్ల గడిచే రోజులాయివి! రెండు వేలు ఖర్చు చేసి పెళ్ళి చేస్తున్నాడట. పార్టీ యిస్తాడట, నా పాత చీర కావాల్సివచ్చింది. యింట్లో తినటానికి కట్ట డానికి ఉన్నాలేకపోయినా పెళ్ళికి ఆర్భాటం






తప్పదు మనలో. ఆఁ నిజంగా పార్టీ యిస్తా డేమిటి! .... ....

కాలింగ్‌బెల్ చప్పుడువిని అనుకున్నాను దశరధుడేమోనని.

తలుపు తీశాను. నిజమే నేను అనుకున్నది, దశరథుడు నిలబడి ఉన్నాడు

'రా...రా....' అంటూ లోపలికి తప్పు కున్నాను.

లోపలికి వచ్చి తలుపేశాడు. చెప్పులు విప్పి, గొడుగు మూలన పెట్టాడు

అట్లాగే నిలబడి పోయాడు.

అప్పుడు చూశాను. కళ్ళలోంచి నీళ్ళు జల జలా రాలుతున్నాయి.

మొహంలో జీవకళలేదు. విగ్రహం ఏడు స్తున్నట్లుగా ఉంది.

కంగారు పడిపోయాను.

"ఏమైంది! ఏమైంది!" అన్నాను.

తుండు కొసతో కళ్లుతుడుచు కున్నాడు.

'మా వెంకట్ చచ్చిపోయాడమ్మా'అన్నాడు.

షాక్ తిన్నాను. ఏమనాలో, ఏమడగాలో తెలీటంలేదు. పెళ్ళయి ఆర్నెల్లయింది కాబోలు. కోడలు కాపరానికి వచ్చిందని చెప్పాడు.

"అదేమిటి! పెళ్ళయింది...

"అవునమ్మా అన్నీ అయిపోయాయి. వాడికి నూరేళ్లు నిండి పోయాయి." అంటూ అక్కడే కూర్చుండి పోయాడు.

'కట్టాకూర్చో తల్లి. వినుకో అంతా చెప్తాను. ఈగుండెలో భారం దింపు కుంటాను. ఇంత కష్టం ఎవరికీ వద్దుతల్లి. నాశత్రువుకికూడావద్దు"

కళ్ళజోడు తీసి జేబులో పెట్టుకున్నాడు. నేను కుర్చీలో కూర్చున్నాను.

"పెళ్ళి అయిందా. పదితులాల బంగారం పిల్లకి బెట్టారు. వాడికి సూటు, రిస్టువాచీ ట్రాన్సిస్టరు..."

"ఔను మంచి సంబంధం. పెళ్ళి బాగా జరి గింది" అన్నాను ఏమయిందో తరువాత సంగతి వినాలని నాకు ఆదుర్దాగా ఉంది.

"ఔనుగదా తల్లి. ఆరునెలలు దివ్యంగా గడిచాయి. మరి కంపెనీవాడి కేంవచ్చిందో పీడి ఉద్యోగం ఊడబీకేశాడు పందిరిపైకి

పోకిన తీగని పీకెయ్యటానికి వాళ్ళకి చేతులెట్లా వొచ్చినాయో! వీడితోబాటు యింకోనలుగురిని తీసేశారు. ఆళ్ళకేంపొప్పి. ఎద్దు పుండుబాధ కాకికి తెలుస్తుందా తల్లీ. వాళ్ళకి డబ్బుబాగా మూలుగుతోంది నువ్వు తింటే వాడికేం, చస్తే వాడికేం. వాడి బతుకు దర్జాగా గడిచిపోతోంది. పాలసీ అంటారు. ప్రాఫిటులేదంటారు. దొంగ కొడుకులు. ఏదైతేనేం తల్లి, మా నోళ్ళలో దుమ్ము పడిపోయింది. సరేనా వాడికి ఉద్యోగం లేదు. వాడుయింట్లోనే కూకోవటం. యింట్లో కూరలేదు నారలేదు. చాయ్‌చుక్కలు కూడా కరువై పోయాయి. నేను చూస్తే ముసలాడినై పోయాను. అప్పటికి టూషన్ చెప్పుతూనే ఉన్నానమ్మా. యిద్దరు పిల్లలు. యిరవై రూపాయలు వస్తాయి. ధరలు చూస్తే అట్లాగ. నా భార్యకి మాయదారిరోగం. దగ్గు దాని ప్రాణం తీస్తోంది.

"సరే ఏమైంది?"

"ఏమౌతుంది తల్లి, రోజూ ఇంట్లో తిట్టుకోటాలు, ఏడ్పులూ. కోడలుపిల్ల చదువుకున్నది కదా. దానికిచీరలుకావాలి. సినిమాకి వెళ్లాలి. చేపలు కావాలి. చేపలేకపోతే ముద్దఎత్తదు. మానాన్న కట్నం యివ్వలేదా? ఆ డబ్బంతా ఏమైంది. అంటుంది. మానాన్న దిక్కుమాలిన సంబంధం చేశాడు అంటుంది. "దేవుడా నన్నెత్తుకపో" అని ఏడుస్తుంది నాభార్య.

వాడు, నా కొడుకు యింటిగడప దాటడు. నలుగురిలోకివెళ్లనంటాడు, యింకో నౌకరీ వెతకమంటే ఏం లేదంటాడు. సత్యం-నా పెద్ద కొడుకు కాలిమీద గొడ్డలివేసుకున్నాడు. హాస్పిటల్లో ఉన్నాడు. అదేసుఖం, యింట్లో రోజూగొడవలే. మీరిట్లాగొడవచేస్తే ఈమాత్రలు తిని చనస్తాని బెదిరించాను. నా భార్యకి నిద్రపట్టడానికి ఆ మాత్రలు యిచ్చాడు డాక్టరు బాబు.

రెండురోజులు బాగానేగడిచింది. ఎవరూ నోరు విప్పలేదు....ఉన్న గంజినీళ్ళు తాగాము. కంట్రాక్టుపని అవుతోందని తెలిసింది. సూపరెన్నెంట్‌సాబ్‌ని వెళ్ళి అడిగి వచ్చాను ఖాళీలున్నాయేమోనని, నెలరోజులు పోయాక రమ్మన్నాడు. రోజులు భారంగా గడుస్తున్నాయమ్మా, తెల్లారే పొద్దు రాక పోతుందాఅని ఓపిక పట్టానమ్మా. యింత జావ, పచ్చిమిరపకాయ ఉల్లిగడ్డకూడాలేదు. ఉంటే కోడలికివ్వాలి. పోనీ ఉద్యోగమిస్తారు వెంకట్‌కి, కంట్రాక్టరుకి లంచం పెడదామనుకుని తాకట్టుకి గొలుసిమ్మని కోడల్ని అడిగాను, ఆ యమ్మ కాళికై పోయింది, యియ్యనుగాక యియ్యను అంది. యిదికూడా మీకిస్తే నాకుదిక్కేమిటి అంది. యిది కూడా మింగేస్తారంది,

"నాకు ఉద్యోగం వస్తుందికదా!" అన్నాడు వెంకట్


"అంత నమ్మకం ఉంటే అప్పుతెచ్చుకోండి. తీర్చుకోండి. తిండికేగతిలేనివాళ్ళని మాఅయ్యకి తెలీదు. నాగొంతు కోశాడు." అని శోకం పెట్టింది.

ఆణ్ణి తనతో వాళ్ళయ్య దగ్గరికి ఎల్లిపోయి రమ్మంది.

నాతల్లినీ, తండ్రినీ ఒగ్గెయ్యనని వీడు. ఉద్యోగంపోయి మావ ఇంటికివెళ్ళనన్నాడు. ఆ తల్లి అలిగి పడుకుంది. నాకూతురు ఎక్కడ నించో బియ్యం తెచ్చి అన్నం వండింది. మేమంతా జావతాగాం. కంచంలో అన్నంపెట్టి మీరిచ్చిన ఊరగాయ ముక్కేసి కోడల్ని పిలిచింది మా యావిడ. అన్నీఉంటే మేమూ బాగా చూసుకుందుమమ్మా. రంగంలో ఉన్నప్పుడు రోజూ కోడికూర తిన్నవాణ్ణి. నాభార్య ఒక్కరోజూ వంటచేసి ఎరగదు, మాకూ పనిమనిషిఉండేది. ఏంచేస్తాం తల్లీ ఓడలు బళ్ళుఅవుతాయి. ఇది మూర్ఖురాలు. సత్యంకానలేదు. పిండి వంటలూ పలారాలు కావాలంటుంది. మొగుడికి ఉద్యోగం పోయిందని తెలుసునాదానికి! నిలబడి పళ్ళాన్ని కాలితో ఒక తన్ను తన్నింది. పళ్లెంబోర్లాపడి అన్నం నేలమీద పడిపోయింది. మేం నలుగురం చూస్తున్నాం తల్లీ, మూడురోజుల్నించి జావతో







పొట్ట నింపుకుంటున్నాం, ఆదికాలితో అన్నాన్ని తన్నేసింది. వాడు, నాకొడుకు ఒక్కవూపులో ఎళ్ళి దాన్ని లెంపకాయ కొట్టేసినాడు.

"నీకు నేను అండి పెట్టలేను, పో వెళ్లిపో, ఎక్కడికి పోతావో నీతండ్రి దగ్గరికి పోతావో సుగపడి దగ్గరికి పోతావో" అని బయటికి తోసేశాడు. ఎనక్కి చూడకుండా ఎళ్ళి పక్కమీద పడిపోయాడు.

అది ఎళ్ళిపోయింది. నా కూతురంత అద్దు పడ్డా వినలేదు. ఆని పెట్టె తీసుకొని వెళ్ళిపోయింది.

"అది ఎళ్ళి పోయిందిరా నాయనా...లే" అని ఎంత లేపినా లేదాడు కాడు. రోజంతా అట్లాగేపడి ఉన్నాడు. రగులు కొంటున్న కొయ్యలాగ.

తెల్లారింది నా కూతురెళ్ళి, బియ్యం దంచి నూకలు తెచ్చింది. చాయ్ చేశాము.

తప్పుపట్టుకెళ్ళి వాణ్ణి లేపింది

"లేవరా వెంకటూ వేడివేడిగా తాగెయ్." అంటూ మీద చెయ్యేసింది. వేసిన చెయ్యిజిల్లు మన్నట్లు ఎనక్కి లాక్కుంది.

"బాబునోయ్... అనిఒక్కకేక.

అందరం పరుగెట్టాం....ఏముంది! ఆవొంట్లో [illegible] పక్కన మాత్రల సీసాకాళీగా వుంది,

నేను అందర్నీ జడిపిద్దా మనుకున్నాను, నటించాను.

వాడు నిజంగానే చేసేశాడు,

పెళ్ళాన్ని పొమ్మన్నాక ఇంక జన్మెందుకు అనుకున్నాడు తల్లీ.

తల్లినీ తండ్రినీకూడా గుర్తుంచుకోలేదు. అందరితో సంబంధం తెంచేసుకున్నాడు. నాకు కడుపుశోకం పెట్టేశాడు....దేవుడిట్లాగరాశాడు తల్లీ, కళ్ళుతుడుచుకున్నాడు.

ఏమనటానికీ నోటమాటరాలేదు.

వినటమైతే కథలాగవినేశాను.

దేవుడురాసినరాత, నుదుట గీత అనుకుని ఓదార్చు కుంటాం.

తండ్రికీ ఉద్యోగంలేక, కొడుకుకి ఉద్యోగం పోవటం వలన కదా ఇట్లాగ జరిగింది, సుఖంగా సాగుతున్న సంసారం కష్టాలపాలయింది.

ఆ పిల్లది మాత్రం తప్పనటం ఎట్లా? ఆ పిల్ల అడిగిందీ, కాదందీ తిండి కోసమేకదా. ఇరవై రూపాయలిద్దా మనుకున్నాను. కాని దానితో వాళ్ళ సమస్య పరిష్కారంకాదు. వాళ్ళదరిద్రం ఆకలీ తీరవు. వాళ్ళకి కావలసింది ఉద్యోగం. దశరథుడికి ఐదు రూపాయలిచ్చి పంపాను. నా దగ్గర ఉద్యోగాలు లేవుకదా ఇవ్వటానికి మరి!